

ఎడ్ల శివకుమార్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎడ్ల శివకుమార్ గౌడ్ లేని లోటు తీర్చలేనిది

ఎల్బీనగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల శివకుమార్ గౌడ్ అకాల మరణం వారి కుటుంబ సభ్యులతో పాటు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ఫేస్-2కు చెందిన ఎడ్ల శివకుమార్ ఇటీవల ఆకాలమరణం చెందిన సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, శివకుమార్ గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు ఐ.అంకిరెడ్డి, నియోజకవర్గం మాజీ యూత్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అరవింద్, సలీమ్, మల్లేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్..

సరూర్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో కార్యకర్తలకు అండగా నిలిచేది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 40వ డివిజన్‌కు చెందిన పి.శ్రీనుముదిరాజ్ ఇటీవల విద్యుదాఘాతంతో అకాల మరణం పొందారు. ఈ క్రమంలో పార్టీ తరపున చేయించిన బీమా పథకం కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు సబితారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్ అనిల్‌యాదవ్, బీఆర్ఎస్ 40వ డివిజన్ అధ్యక్షుడు దయానంద్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ పారిజాతారెడ్డి

ఘనంగా సేవాలాల్ జయంతి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, బంజారా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 32వ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, స్థానిక బంజారా సంఘం నేతలు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న టీఏఏ అధ్యక్షులు రాజారావు తదితరులు

టీఏఏ డైరీని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): టీఏఏ 2024 డైరీని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టెడ్ అడ్వకేట్స్ అసోసియేషన్ (టీఏఏ) అధ్యక్షులు ఏ.రాజారావు అన్నారు. ఆదివారం కొత్తపేట న్యూ నాగోల్‌లోని టీఏఏ కార్యాలయంలో ఆయన టీఏఏ 2024 డైరీని ఆవిష్కరించారు. ప్రతినిధులందరూ టీఏఏ కార్యకలాపాలను విజయవంతంగా చేపట్టడానికి సహకరించాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు కందుల నరేష్, లక్ష్మణ్‌రాజ్, మహేందర్, శ్రీశైలం, నాగార్జున, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూబీఏఎఫ్ సీనియర్ అసోసియేట్‌గా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్



డబ్ల్యూబీఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బేలబర్స్ అల్టుంటాస్‌తో డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ బిజినెస్ ఏంజిల్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం (డబ్ల్యూబీఏఎఫ్) ఎంటర్‌ప్రెన్యూర్స్ గ్రూప్ డిప్లమసీ యాక్షన్ సీనియర్ అసోసియేట్‌గా హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సులేట్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్‌కు అవకాశం దక్కింది. డబ్ల్యూబీఏఎఫ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బేలబర్స్ అల్టుంటాస్ సంబంధిత పత్రాలను మీర్ నాసిర్ అలీఖాన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక సంస్థలోకి సభ్యుడిగా ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్లోబల్ బిజినెస్‌లో సానుకూల పరిస్థితులను గమనించడం, మార్పులను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. జీ20 గ్లోబల్ పార్టనర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్(జీపీఎఫ్ఐ)కు అనుబంధ సంస్థ అయిన డబ్ల్యూబీఏఎఫ్‌లో పలు దేశాల అధ్యక్షులు, ప్రతినిధులు సభ్యులుగా కొనసాగుతున్నారు.



మాట్లాడుతున్న కాలనీ నూతన అధ్యక్షుడు జయవర్ధన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు

పద్మానగర్‌కాలనీ నూతన కార్యవర్గం

చంపాపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ పద్మానగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కుంభం జయవర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో కాలనీ అధ్యక్షుడిగా కుంభం జయవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బండా సుధకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా ఎ.రామకిషన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా యం.ఉపేందర్‌రెడ్డి, డి.యాదయ్యగుప్తాలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా యస్.మహిపాల్‌రెడ్డి, వి.వంశీరావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కె.ప్రకాష్, డి.వాసు, డి.వెంకటయ్యలను ఎన్నుకున్నారు.


డెలివరీ బాయ్ అదృశ్యం



సహీద్‌ఖాన్

బాలానగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. బాలానగర్ రాజూ కాలనీకి చెందిన శబ్నం, కానీ దంపతుల కుమారుడు సహీద్‌ఖాన్(20). ఈ నెల 12న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా ఇంటికి రాలేదు. మరుసటి రోజు తల్లి ఫోన్ చేయగా ఎత్తి తర్వాత ఫోన్ చేస్తానని పెట్టేశాడు. అప్పటి నుంచి అతడి సెల్ స్విచ్ఛాఫ్ ఉంది. ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో తల్లి బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది. సహీద్‌ఖాన్‌ను ఎవరైనా గుర్తిస్తే ఫోన్ నం.9490617114కు సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ సూచించారు.

లక్ష్మీనగర్ కాలనీలో కలుషిత నీటి సరఫరా



లక్ష్మీనగర్‌కాలనీలో ఇళ్లకు నల్లాల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీరు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో గల ఇళ్లకు నల్లాల ద్వారా కలుషిత నీటి సరఫరా అవుతుండడంతో కాలనీవాసులు తీవ్ర నీటి ఎద్దడికి గురవుతున్నారు. కాలనీలో దాదాపు 200 ఇళ్లు ఉండగా సుమారు 50 ఇళ్లకు వారం రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. మొదటి 15 నిమిషాలు వచ్చే నీరంతా మురుగుగా దుర్వాసనతో వస్తోంది. ఆ తర్వాత కొంత తేటగా నీరు సరఫరా అవుతున్నా దుర్వాసన మాత్రం పోవడం లేదు. కలుషిత నీరు తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసుల వాపోయారు.

నీటి శాంపిల్ ఫోటోలతో సీజీఎంకు ఫిర్యాదు..

లక్ష్మీనగర్ కాలనీలోని ఇళ్లకు సరఫరా అవుతున్న కలుషిత నీటి శాంపిల్స్‌ను సేకరించి ఫోటోల ద్వారా కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి పున్‌రెడ్డి కృష్ణారెడ్డి జలమండలి సీజీఎం నాగేందర్‌కు, మూసారాంబాగ్ సెక్షన్ మేనేజర్ చంద్రునాయక్‌లకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీజీఎం నాగేందర్ కలుషిత నీటి నివారణకు వెంటనే చర్యలు తీసుకునేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. లక్ష్మీనగర్ కాలనీలో కలుషిత నీరు సరఫరా అవుతున్న ఇళ్లకు జలమండలి సిబ్బంది వచ్చి శాంపిల్స్ సేకరించారు. సోమవారం పూర్తి స్థాయి నివారణ చర్యలు చేపడతామన్నారు.

జాతీయ రహదారి విస్తరణతో వాహనదారులకు తంటాలు

- అటు వైపు వారు ఇటు రావాలన్నా.. ఇటు వైపు వారు అటు వెళ్లాలన్నా.. మూడు కిలో మీటర్లు తిరగాల్సిందే



హయత్‌నగర్ వినాయకనగర్ కాలనీ వద్ద మూసి వేసిన యూటర్న్

హయత్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. మన్సూరాబాద్ డివిజన్, హయత్‌నగర్ డివిజన్‌ల మధ్య గుండా ఉన్న విజయవాడ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులతో అటు ఉన్న వారు ఇటు రావాలన్నా.. ఇటు ఉన్న వారు అటూగా వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదాచారులైతే ఏదో రకంగా రోడ్డును దాటుతున్నారు. వాహనదారులు మాత్రం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముందున్న యూటర్న్‌కు వెళ్లాలంటే కిలో మీటరు.. ఆటో నగర్ యూటర్న్‌కు వెళ్లాలంటే రెండు కిలో మీటర్ల వరకు వెళ్లాల్సి వస్తోంది. ఇంతకు ముందు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఆటోనగర్ వరకు నాలుగు చోట్ల వాహనాలను మలుపుకునే వీలు ఉండేది. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో కాంట్రాక్టర్ అన్ని మలుపులు మూసివేసి కేవలం రెండింటిని మాత్రమే తెరిచారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఆటోనగర్ వరకు సుమారు మూడు కిలోమీటర్లకు పైగా దూరం ఉంటుంది. దీంతో యూటర్న్‌ల వద్ద తీవ్ర ట్రాఫిక్ జాం అవుతోంది. అక్కడ ట్రాఫిక్ పోలీసులు కూడా లేకపోవడంతో వాహనదారులు అడ్డగోలుగా రోడ్డును దాటుతున్నారు. అయితే పనులు జరగని చోట కూడా యూటర్న్‌లను మూసి ఉంచారు. ఆటో నగర్, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ మధ్యలో ఒక చోట తాత్కాలికంగా యూటర్న్ తెరిపిస్తే సమస్య కొంత వరకు తీరే అవకాశం ఉంది.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నేరాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటు

కొత్తపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో నేరాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతగానో ఉపయోగపడుతాయని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఎంఎల్‌సీలు బొగ్గారపు దయానంద్‌గుప్త, యెగ్గె మల్లేశం, ఎల్బీనగర్ ఎంఎల్ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిల నిధులతో శివగంగ కాలనీలో 13 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆదివారం కాలనీలో కార్పొరేటర్ పవన్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. బీజేపీ నాయకుడు సుందర్‌నారాయణ, అశ్విన్‌సింగ్, స్వామి, పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం

డ్రైనేజీ నూతన పైప్‌లైన్ పనులతో మురుగు సమస్యలు పరిష్కారమవుతాయని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. మానస ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని, జలమండలి అధికారులు పనులను పర్యవేక్షించాలనీ సూచించారు. ఈ పనుల్లో ధ్వంసమయ్యే పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలనీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సుందర్ నారాయణ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ 10కే, 21కే రన్

రాయదుర్గం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ వార్షిక ఈవెంట్-2024 హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆదివారం జరిగింది. 10కే, 21కే రన్ నిర్వహించారు. రన్‌లో రెండువేల మంది పాల్గొన్నారు. హెచ్‌సీయూకంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ పి.తుకారం, ఐజీపీ రమేష్‌రెడ్డి, డీసీపీ వినీత్ జెండాఊపి రన్‌ను ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్ అందజేశారు. జంటనగరాల్లో ఫిట్‌నెస్ కార్యకలాపాల ప్రాధాన్యత తెలియజేయడం ఈ రన్ ఉద్దేశమన్నారు.



వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెడ్డి సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షులు భుజంగ రెడ్డి

రెండుచోట్ల ఔషధ నియంత్రణ అధికారుల దాడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ అధికారులు నగరంలో రెండు చోట్ల దాడిచేసి పెద్దమొత్తంలో నిల్వచేసిన మందులను స్వాధీనం చేసుకున్నారు. నాగోల్‌లో అక్రమంగా గోడౌన్ నిర్వహిస్తూ మందులు విక్రయిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారంతో అధికారులు శనివారం దాడిచేశారు. దాడుల్లో శామీర్‌పేట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.బాలనాగంజన్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు బి. లక్ష్మీనారాయణ, బి. ప్రవీణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో..

కుత్బుల్లాపూర్‌లో శ్రీ బ్లూటెన్ ఫార్మసీపై అధికారులు దాడి చేసి ఫుడ్ లైసెన్స్‌తో మల్టీ విటెన్స్ క్యాప్సుల్స్ అక్రమంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దాడుల్లో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. విజయ్‌గోపాల్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, కె. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో రేకులషెడ్డును దాత బసిగూడెం జంగారెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ఆలయ ఛైర్మన్ నల్ల రఘుమారెడ్డి

హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి

చంపాపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో దాతలు, ఎండోమెంట్ నిధులు రూ.63.5లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆదివారం ఆలయ ఛైర్మన్ నల్ల రఘుమారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఆలయంలో ఎండోమెంట్ నిధులు రూ.42లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్, దాతలు రాజు, వేగ్నేశ్నా(ఇండియా) సహకారంతో రూ.17లక్షలతో వెయ్యి లీటర్ల ఆర్‌ఓ ప్లాంట్, దాతలు నల్ల సుమిత రఘుమారెడ్డి, బసిగూడెం సుజాత జంగారెడ్డి సహకారంతో భక్తుల సౌకర్యార్థం రూ.4.5 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు అంజిరెడ్డి, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, బిల్లకంటి కిరణ్‌కుమార్, మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, మధుసాగర్, చేగోని సురేష్‌గౌడ్, శైలజ, గూడూరు మధుసూదన్‌రెడ్డి, చీర తిరుమలేష్, మేకల యాదగిరి, మాజీ ధర్మకర్త బసిగూడెం జంగారెడ్డి, దాతలు గార్లపాటి పురుషోత్తం, సురేందర్‌గుప్తా, రాజు, అర్చకులు పి.శంకరశర్మ, అనంతరామశర్మ, కుర్మేటి అంబప్రసాద్, సంతోష్‌శర్మ, ఆలయ సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించిన నేతలు

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, పాత పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ అసోసియేషన్ 2024 డైరీ ఆవిష్కరించి, నూతనంగా ఎనుకున్న కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డా. జి. నిర్మల మాట్లాడుతూ.. ఐఆర్ 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సెక్రటరీ జనరల్ యాకుబ్ పాషా మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల విషయమై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలన్నారు. అసోసియేషన్ ఛైర్మన్ సంపత్‌కుమార్ స్వామి, వైస్‌ఛైర్మన్ గడ్డం బాలస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంకే రాజు, హెచ్‌అండ్‌టీ ఫోరం అధ్యక్షుడు తత్వానంద చారి పాల్గొన్నారు.

బాలుడిపై దాడి చేసిన కుక్కలు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని జింకలబావి కాలనీలో కుక్కలు వీరంగం సృష్టించాయి. ఖాదీభండార్‌లో పనిచేస్తున్న కొమ్ము మధు కుమారుడు వినీత్ (7) ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేసి కరిశాయి. స్థానికులు కుక్కల బారి నుంచి బాలుడిని కాపాడారు. కుక్కల దాడిలో బాలుడి ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వినీత్‌ను నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. వీధి కుక్కల కారణంగా రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నామని, చిన్న పిల్లలను బయటకు పంపేందుకు ఆలోచిస్తున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

రసరమ్యంగా 'రామామృతం' నాట్యం



నాట్యం చేస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి కీర్తనలకు రామభక్తి హృదయాన్ని చాటుతూ కళాకారులు ప్రదర్శించిన రామామృతం నాట్య ప్రదర్శన రసరమ్యంగా సాగింది. పరంపర ఫౌండేషన్, అభినేత్రి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన వేదికపై 'రామామృతం ది నెక్టార్ ఆఫ్ త్యాగరాజ' శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువు ప్రమోద్ రెడ్డి తన శిష్య బృందంతో కలిసి రామామృతం నాట్యాన్ని ప్రదర్శించారు. గణపతి కీర్తన, రామ కోదండరామ, నారాయణ హరి వంటి ఉత్సవ సంప్రదాయ కీర్తనలకు నర్తించి భళా అనిపించారు. ఇందులో భాగంగా రారా మా ఇంటికి అంటూ సాగిన కీర్తనకు పల్లకీలో రాముని ఊరేగింపు చేస్తూ నర్తించారు. కొలువై ఉన్నాడే కోదండ రాముడు అంటూ రామ పరివారాన్ని చూపిస్తూ సాగిన ప్రదర్శన రంజింపజేసింది. సుమారు 36 మంది నర్తకులు ప్రదర్శించిన ఈ నాట్యం ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. వైవిధ్యంగా సాగిన ఈ నృత్య ప్రదర్శన ఆహూతుల్ని మైమరిపించింది. ఈ కార్యక్రమంలో శశిరెడ్డి, ప్రతిభా మురళీధర్‌రావు, అనుపమ కైలాష్, కళాకృష్ణ తదితరులు పాల్గొని నాట్య గురువు ప్రమోద్ రెడ్డితో పాటు నర్తకులను ఘనంగా సత్కరించి అభినందించారు.



టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

టిమ్స్ ఆస్పత్రి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేయాలి

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): టిమ్స్ ఆస్పత్రి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలతో పాటు తగిన భద్రతా చర్యలు పాటించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. కొత్తపేటలో నిర్మాణంలో ఉన్న టిమ్స్ ఆస్పత్రి పనులను అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఎల్బీనగర్ శివారు ప్రాంతాల ప్రజలతో పాటు, గ్రామాల నుంచి నగరానికి వచ్చే సామాన్య ప్రజానీకానికి కొత్తపేటలోని టిమ్స్ ఆస్పత్రి ఆరోగ్య ప్రదాయినిగా మారనుందని అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు సేదదీరేందుకు ఐదంతస్తుల భవనం కూడా నిర్మిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చిరంజీవి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కార్పొరేటర్ నరేందర్‌కుమార్

మీర్‌పేట్‌లో హస్తం గూటికి మరో కార్పొరేటర్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ నరేందర్‌కుమార్ అలియాస్ నందు ఆదివారం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన ఆయన.. ఆ తర్వాత అప్పటి మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరి.. తాజాగా హస్తం గూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

ఉచిత రక్తదాన శిబిరం

చంపాపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రఘు యువసేన ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఎల్బీనగర్ సంఘం బ్లడ్ సెంటర్ వారు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రఘు ముదిరాజ్, శ్రీశైలం, అఖిల్, చందు, భరత్, శ్రీకాంత్, శంకర్‌యాదవ్, వినోద్, వెంకటేష్, సర్వేష్‌గౌడ్, చింటూ, సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీసీ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రీతంకుమార్



ప్రీతంకుమార్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘానికి అనుబంధమైన బీసీ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగోల్‌కు చెందిన ప్రీతంకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని ప్రీతంకుమార్‌కు అందజేశారు.

స్థానిక ఉత్పత్తులను సద్వినియోగం చేసుకోవాలి



జైల్ సూపరింటెండెంట్‌కు పోస్ట్‌బాక్స్‌ను అందజేస్తున్న ఎల్‌పీడీఓ ఛైర్మన్ భరత్ సంగం

చంపాపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలోని ఎల్‌పీడీఓ ఛైర్మన్ భరత్ సంగం ఆదివారం చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌ను కలిసి మై నేషన్‌లో భాగంగా ఇంటింటికి పోస్ట్ డబ్బాను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ మాతంగి వీరస్వామి, హెడ్ వార్డర్ బి.వీరబాబు పాల్గొన్నారు.



ఇంజనీర్స్ కాలనీ నూతన కమిటీ సభ్యులు

ఏకగ్రీవంగా ఇంజనీర్స్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ ఇంజనీర్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం కాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బీఆర్ అర్జున, అధ్యక్షులుగా ఎ.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నరేందర్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్ రెడ్డి, సాహిల్ కుమార్, కోశాధికారిగా కె.శ్రావణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా రామ్మోహన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు.



కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ

సైదాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్‌నగర్ ఆధ్వర్యంలో శంకేశ్వర్‌బజార్‌లో మహిళలకు ఆదివారం క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ హరిష్ రెడ్డి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ కుమార్, కృష్ణకువర్, రవీంద్ర, భార్గవ రాజు తదితరులు పాల్గొన్నారు.